

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

శ్రీ మహాలక్ష్మిగా దుర్గాదేవి

లేపాక్షి, అక్టోబరు 7: దసరా శరన్నవరాత్రి వేడుకల ఐదోరోజు సోమవారం లేపాక్షి ఆలయంలో దుర్గాదేవి.. శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గావీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

శ్రీకృష్ణుడిగా ఖాద్రీశుడు

కదిరి, అక్టోబరు 7: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు సోమవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం కృష్ణావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడిగా కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

మళ్లీ నష్టాలే..!



- అదునులో కురవని వానలు
- పడిపోయిన వేరుశనగ దిగుబడి
- ఎకరాకు 3 బస్తాలే
- పెట్టుబడి కూడా దక్కదంటున్న రైతులు



వేరుశనగ పంట

ధర్మవరం రూరల్, అక్టోబరు 7: కరువు రైతుకు ఏటా నష్టాలే ఎదురవుతున్నాయి. అయినా.. మొండిగా ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేశారు. ఆరుగాలం శ్రమించి, లక్షలు పోసి పెట్టుబడులు పెట్టి పంట పండించినా వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు తగ్గి అప్పులే మిగిలే పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఇందులో దిగుబడి లేదని తెలుతోంది. నెల రోజులుగా వర్షాలు కురవక దిగుబడి పూర్తిగా కోల్పోయి, పంట చేతి కందే పరిస్థితి లేదు. రైతులు అప్పుల్లోకి కూరుకుపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. నాలుగేళ్లుగా వేరుశనగ పంట పండక రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు. వేరుశనగ పంట నష్టపోయిన రైతులకు గత వైసీపీ ప్రభుత్వం పరిహారం అందించలేదు. దీంతో రైతులు పంట సాగుకు దూరమవుతున్నారు. కందిపంటకు అధికంగా ఇన్సూరెన్స్ వర్తింపజేయడంతో వేరుశనగ సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపలేదు. వీటిన్నంటినీ తట్టుకుని వేరుశనగ సాగుచేసిన రైతులకు ఈ ఏడాది కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితులను వారిని నట్టేట ముంచాయి. ప్రస్తుతం పంటకోత ప్రయోగాల్లో ఎకరాకు మూడు బస్తాలు కూడా దిగుబడి రాలేదని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈలెక్కన రైతులకు పెట్టుబడి కూడా దక్కదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వేరుశనగకు క్రాప్ ఇన్సూరెన్స్‌ను పూర్తిస్థాయిలో అందిస్తేనే కాసింత పెట్టుబడి ఊరటేనా లభిస్తుందని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు.

62 వేల హెక్టార్లలో సాగు

జిల్లావ్యాప్తంగా వేరుశనగ పంట 62 వేల హెక్టార్లలో రైతులు సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణాలతో గతేడాది కన్నా ఈసారి వేరుశనగ సాగు తగ్గింది. పంట సాగుకు ఎకరాకు సేద్యపు ఖర్చులు, విత్తనాలు కలిపి రూ.15వేల వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గింది.

మూడు బస్తాలే...

ఇటీవల పంటకోత ప్రయోగాల్లో వేరుశనగ దిగుబడి పూర్తిగా తగ్గిపోయినట్లు తేలింది. ధర్మవరం మండలంలో ఇటీవల వేరుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఎకరాకు 3 బస్తాలే వస్తాయని అధికారులు తేల్చారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతస్థాయిలో దిగుబడి పడిపోతే కనీసం పెట్టుబడులు రావని గగ్గోలు పెడుతున్నారు.

ఏటా నష్టాలే...

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ. గతంలో ప్రతి రైతు వేరుశనగ సాగుచేసేవాడు. రానురాను పంట దిగుబడులు రాకపోవడం, వర్షాభావ పరిస్థితులు తలెత్తడం, పంటపండినపుడు అధిక వర్షాలతో నష్టపోవడం కారణంగా వేరుశనగ సాగు చేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులు దాపురించాయి. ఈ ఏడాది కూడా జిల్లావ్యాప్తంగా సకాలంలో వర్షాలు కురవక దిగుబడులు తగ్గి నష్టాలే మిగిలాయి. ఏటా వేరుశనగ రైతులకు నష్టాలే దిగుబడులుగా మారాయి.

క్రాప్ ఇన్సూరెన్స్ దక్కేనా..?

ప్రధాన పంట వేరుశనగకు గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతంతమాత్రమే క్రాప్ ఇన్సూరెన్స్ ఇచ్చి, చేతులు దులుపుకున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట పెట్టుబడులకు, గత ప్రభుత్వం ఇచ్చిన ఇన్సూరెన్స్‌కు ఏమాత్రం పొంతన లేకపోవడంతో రైతులు రానురాను వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గించేశారు. ఈ ఏడాది కూడా వేరుశనగ సాగుచేయగా.. పంట దిగుబడి వచ్చే సమయంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. ఈ ఏడాదైనా ప్రభుత్వం పెట్టుబడులకు తగ్గట్టుగా క్రాప్‌ఇన్సూరెన్స్ అందించి, ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వేరుశనగ దిగుబడిని లెక్కిస్తున్న అధికారులు

ఎకరాలో వేరుశనగ
సాగుకు పెట్టుబడి- రూ.15 వేలు
ఎకరాలో దిగుబడి- 3 బస్తాలు
బస్తా ధర - రూ.3 వేలు
3 బస్తాలకు..- రూ.9 వేలు
నష్టం- రూ.6 వేలు

అప్పులే మిగిలాయి..

వేరుశనగ సాగుచేయాలంటే ఎకరాకు రూ.15 వేలకుపైగా పెట్టుబడి అవుతుంది. ఈ లెక్కన ఒక్కో రైతు 5 ఎకరాల వరకు సాగుచేస్తుంటారు. దీనిప్రకారం 5 ఎకరాలకు రూ.75 వేల వరకు పెట్టుబడి పెడతారు. పంట నాలుగు నెలల వ్యవధిలో వివిధ రకాల తెగుళ్ల నివారణకు రసాయన మందుల పిచికారీ, సేద్యపు పనులు, కలుపుతీత కూలీలు, దిగుబడి వచ్చేందుకు మందులు తదితర ఖర్చులు రైతులు చేస్తుంటారు. వీటికోసం ఏటా రూ.లక్షల్లో పెట్టుబడి పెడతారు. పంట చేతి కొచ్చే సమయానికి అతివృష్టి, అనావృష్టి కారణంగా దిగుబడులు దక్కక అప్పులే మిగులుతున్నాయి. కన్నీళ్ల పంట పండిస్తున్నాయి.

పూర్తిగా నష్టపోయాం



మూడెకరాల్లో వేరుశనగ సాగుచేశా. విత్తనాలు, సేద్యపు, కలుపుతీత ఖర్చులు, మందులు కలిపి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టా. రెండు నెలలుగా సరైన వర్షాలు కురవకపోవడంతో కాసిన పిందెలన్నీ అలానే ఉండిపోయి, దిగుబడి తగ్గిపోయింది. దీంతో పూర్తిగా నష్టపోయా.

\- రాఘవరెడ్డి, రైతు, చిగిచెర్ల, ధర్మవరం మండలం

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం

ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పంట దిగుబడిని ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కిస్తున్నాం. నివేదికలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వానికి అందజేస్తాం.

\- సుబ్బారావు,
జిల్లా వ్యవసాయాధికారి

ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలి



ఐదెకరాల్లో పంట సాగుకు రూ.80వేలు పెట్టుబడి పెట్టా. దిగుబడి దారుణంగా తగ్గిపోయింది. పెట్టుబడి కూడా దక్కలేదు. పశుగ్రాసమన్నా దక్కుతుందనుకుంటే వర్షాలు రాక, పైరు పెరగక పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంటపై పూర్తిగా ఆశలు వదులుకున్నా. ప్రభుత్వం పెట్టుబడికి తగ్గట్టుగా ఇన్సూరెన్స్ ఇచ్చి ఆదుకోవాలి.

\- నాగభూషణ, గరుడంపల్లి, ధర్మవరం మండలం

మాప్రాంతంలో మేమే..

- మద్యం దుకాణాలకు ఇతరులు దరఖాస్తు చేయొద్దు..
- కూటమి నేతల అనుచరగణం బెదిరింపులు
- పెనుకొండలో వాగ్వాదం

పుట్టపర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడంలో కొందరు కూటమి ప్రజాప్రతినిధుల అనుచరులు బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిండికేట్‌గా ఏర్పడి, ఇతరులెవరూ దరఖాస్తులు చేయరాదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకుని, దుకాణం దక్కితే ఎలా నడుపుతారో చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్ వద్ద మంత్రి సవిత అనుచరులం అంటూ సోమవారం కొందరు టీడీపీ నాయకులు.. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులు దరఖాస్తు చేసుకోకుండా అడ్డుతగిలారు. వారి దరఖాస్తులను లాగేసుకుందుకు ప్రయత్నించారు. ఎంపీ వర్గీయులు వెనక్కి తగ్గకపోవడంతో కాసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం సాగింది. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆఖరుకు పోలీసుల జోక్యంతో దరఖాస్తులు సమర్పించారు. అధికార పార్టీ వారికే ఇలా దుకాణాలకు దరఖాస్తు చేయొద్దంటూ అడ్డుతగలడంతో జిల్లాలో ఇక మద్యం ఔత్సాహిక వ్యాపారుల పరిస్థితి ఏమిటో మరి. వదంతులను నమ్మొద్దనీ, నిర్భయంగా మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ శాఖాధికారులు చెబుతున్నారు. ఒక్కో దుకాణానికి కనీసం 30 దరఖాస్తులు లేకుండా లైసెన్సు ఇవ్వమంటూ హెచ్చరిస్తూనే.. మద్యం దుకాణాలకు దరఖాస్తుదారులను బతిమలాడుతున్నారు. దరఖాస్తుకు మిగిలింది రెండు రోజులే. ఔత్సాహికులను గుర్తించి, వారితో దరఖాస్తులు వేయించేలా ఆయా ఎక్సైజ్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలపై రాష్ట్ర, జిల్లాస్థాయిలో అధికారులు ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మావారే..

ప్రైవేటు మద్యం దుకాణాలకు ఎవ్వరైనా.. ఎక్కడి నుంచైనా, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చనని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మద్యం దుకాణాలకు తమ ప్రాంతంలో తమవారే దరఖాస్తు చేసుకుంటారనీ, ఇతరులు వేయొద్దని మద్యం వ్యాపారులను హెచ్చరిస్తున్నారు. ఇలా జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అనుచరులు, ముఖ్య నాయకులు దరఖాస్తుల్లోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరిస్తున్నారు. తమను కాదని దరఖాస్తు చేస్తే దుకాణం పెట్టనివ్వమనీ, ఎలా వ్యాపారం చేస్తారో చూస్తామంటూ కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు బెదిరిస్తున్నారు. ఈనేపథ్యంలో ఏడు రోజులు గడిచినా మద్యం లైసెన్సులకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావట్లేదు. ఇప్పటిదాకా ఆయా నియోజకవర్గాల్లో కీలక నేతలు తప్ప.. ఇతరులెవరూ దరఖాస్తులు వేయట్లేదు. జిల్లా అంతటా అధికార కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన నేతలు దరఖాస్తుల్లోనే సిండికేట్‌గా ఏర్పడ్డారని తెలుస్తోంది. ఏ దుకాణానికి ఎవరు దరఖాస్తు చేయాలో ఆదేశిస్తున్నారు. దరఖాస్తులు చేసేవారిని ముందే గుర్తించి, వారిని గుప్పిట్లోకి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అనుచరగణానికి దుకాణాలు దక్కేలా పావులు కదుపుతున్నారు. కొందరు కూటమి నేతల బెదిరింపులతో దుకాణాలకు దరఖాస్తు చేయాలంటేనే జంకుతున్నారు.

మిగిలింది రెండు రోజులే..

జిల్లాలో 87 మద్యం దుకాణాలకు దరఖాస్తులు పిలిచారు. ఒక్కో దుకాణానికి 30 చొప్పున దాదాపు 2600దాకా దరఖాస్తులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. దుకాణానికి రూ.2 లక్షలు బ్యాంకు డీడీ చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం నాన్ రీఫండబుల్. ఇలా.. జిల్లాలో మొత్తంగా రూ.52కోట్ల ఆదాయం వస్తుందని భావించింది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏడు రోజులు గడిచిపోయింది. సోమవారం నాటికి దాదాపు 375 మాత్రమే వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ చెబుతోంది. హిందూపురం, ధర్మవరం, కదిరి మున్సిపాలిటీల్లో 22 మద్యం దుకాణాలకు 71 దరఖాస్తులే వచ్చాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పెనుకొండ, పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 107 దాకా సమర్పించారు. దరఖాస్తుల స్వీకరణకు రెండు రోజులే మిగిలి ఉంది. జిల్లాలో కొందరు నాయకుల తీరు కారణంగానే దరఖాస్తులు రావట్లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తమ ప్రాంతంలో తమ వారే అన్నట్లుగా అధికార కూటమి అనుచరగణం సిండికేట్ అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అంచనా ప్రకారం ఆదాయం ఆర్జిస్తుందా.. లేదా.. అన్నది మరో రెండ్రోజుల్లో తేలనుంది.



మంత్రి అనుచరులమంటూ దరఖాస్తు చేసేందుకు వస్తున్న వారిని అడ్డుకుంటున్న నాయకులు

సమస్యలను పరిష్కరించి..

నమ్మకం నిలపండి

- బీసీ సంక్షేమ, చేనేత జౌళి మంత్రి సవిత
- పెనుకొండలో ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి హాజరు



ఫిర్యాదిదారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 7: కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల సమస్యలను పరిష్కరించి, దానిని నిలబెట్టాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుంచి 419 ఫిర్యాదులు అందాయి. వాటిపై బాధితులను అడిగి, మంత్రి వివరాలు తెలుసుకున్నారు. పింఛన్, రేషన్‌కార్డు, భూవివాదాలు, తాగునీరు, విద్యుత్, ఇంటి నిర్మాణం, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిని స్వీకరించిన మంత్రి.. కొన్నింటిని అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఫిర్యాదులను మండలాల వారీగా అధికారులకు అందించి, న్యాయం చేస్తామన్నారు. పెనుకొండ మండలంలో 317, సోమందేపల్లి 46, గోరంట్ల 10, మడకశిర 3, రొద్దం 23, అమరాపురం 3, చిలమత్తూరు 2, కొత్తచెరువు 1, హిందూపురం 4, కడప 1, లేపాక్షి 3, పరిగి 7 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కమిషనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

ధర్మవరంలో హ్యాండ్లూమ్ క్లస్టర్

ఏర్పాటు చేయండి

కేంద్ర జౌళి, చేనేత శాఖ మంత్రికి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వినతి




కేంద్రమంత్రికి వివరిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరంరూరల్, అక్టోబరు 7: పట్టుచీరలు ఉత్పత్తికి ప్రసిద్ధిచెందిన ధర్మవరంలో హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని కేంద్ర జౌళి, చేనేత శాఖమంత్రి గిరిరాజ్‌సింగ్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని మంత్రి సత్యకుమార్ కలిసి, ఇందుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తన లేఖ ద్వారా అందించారు. పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరారు. పవర్‌లూమ్స్ విపరీతంగా పెరిగిపోతుండటంతో ధర్మవరం సంప్రదాయ పట్టుచీరల తయారీ రంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోందన్నారు. దీంతో ఈ రంగంపై ఆధారపడిన వారి ఆదాయం గణనీయంగా తగ్గిపోతూ వారు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సవాళ్ల ఊబిలో చిక్కుకున్న ధర్మవరం చేనేత, పట్టుచీరల ఉత్పత్తి రంగాన్ని గాడిలో పెట్టేందుకు డీపీఆర్‌లో పలు ప్రతిపాదనలు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 28,500, ధర్మవరం ప్రాంతంలో 12,800 కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయన్నారు. చేనేత కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుని వారి జీవితాలను చక్కదిద్దేందుకు ఈ రంగంలో తగిన పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు తాను ప్రతిపాదించిన చర్యలు ఉపయోగపడతాయని మంత్రి పేర్కొన్నారు. రూ.30కోట్ల అంచనావ్యయంతో ప్రతిపాదిస్తున్న ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటులో 80 శాతం మేర నిధులు సుమారు రూ.24 కోట్లు కేంద్రం భరిస్తే మిగిలిన 20శాతం రూ.6కోట్లు రాష్ట్రం భరిస్తుందని లేఖలో తెలిపారు. ప్రతిపాదించిన హ్యాండ్లూమ్ క్లస్టర్‌తో అనేక ప్రయోజనాలున్నందున ఈ డీపీఆర్‌ను పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ లేఖలో విన్నవించారు.

టమోటా ధర తెచ్చిన తంటా..!

- వ్యాన్‌ను 250 కి.మీ, వెంటాడిన ముఠా
- ఆపి.. డ్రైవర్‌కు బెదిరింపులు
- రూ.5 లక్షలు దోపిడీ



సోమందేపల్లి, అక్టోబరు 7: టమోటా ధర రోజురోజుకీ పెరుగుతోంది. సెంచరీకి చేరువవుతోంది. పంట సాగు చేసిన రైతులకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. టమోటా దిగుబడిని మార్కెట్‌కు తీసుకెళ్తే.. రూ.లక్షలతో రైతులు, వ్యాపారులు తిరిగొస్తున్నారు. ధర పెరుగుదలే దోపిడీకి కారణమైంది. టమోటాలు విక్రయించి వస్తున్న వ్యాన్‌ను దొంగల ముఠా వెంటాడింది. ఏకంగా 250 కిలోమీటర్లు దూరం వెంటపడి మరీ దోపిడీ చేసింది. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ములుబాగల్‌కు చెందిన వ్యాన్‌లో టమోటాల లోడ్‌తో డ్రైవర్ నయాజ్ హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ విక్రయించి, తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక కర్నూలు వద్ద టీకోసం వ్యాన్‌ను ఆపాడు. అక్కడ ఓ ముఠా గమనించింది. టమోటా విక్రయించి వస్తున్న విషయం తెలుసుకుంది. పెద్దఎత్తున డబ్బు ఉంటుందని భావించి కారులో వెంటబడ్డారు. వ్యాన్ ఎక్కడా ఆపకుండా వచ్చేసింది. సోమందేపల్లి సమీపంలోకి రాగానే కారును.. వ్యాన్‌కు అడ్డంగా వచ్చి ఆపారు. వ్యాన్ నిలపగానే డ్రైవర్ నయాజ్‌ను బెదిరించి సెల్‌ఫోన్ లాక్కున్నారు. తరువాత అతడివద్దనున్న టమోటాల సొమ్ము రూ.5లక్షల నగదును అపహరించుకెళ్లారు. దీంతో బాధితుడు సోమందేపల్లి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.



అత్యాధునిక సౌకర్యాలతో ఉన్న నవజాత శిశువుల అంబులెన్స్



వాహనంలో వెంటిలేటర్ సదుపాయం

నవజాత శిశువులకు ప్రత్యేక అంబులెన్స్

- పసికందులను రాష్ట్రంలో ఎక్కడికైనా తరలించే అవకాశం
- అత్యాధునిక సౌకర్యాలు
- వెంటిలేటర్ సదుపాయం కూడా..
- పురం ఆస్పత్రికి కేటాయింపు

హిందూపురం అర్బన్, అక్టోబరు 7: అప్పుడే పుట్టిన, రోజుల వయసున్న పసిపిల్లలను వైద్యం నిమిత్తం ఎక్కడికైనా తరలించాలంటే చాలా ఇబ్బందే. సరైన అంబులెన్స్ ఉండదు. ఐసీయూ సదుపాయం ఉండదు. వెంటిలేటర్ అవసరమైతే మరీ దారుణం. ఆ చాన్సే ఉండదు. ఈ నేపథ్యంలో నవజాత శిశువుల కోసం అత్యాధునిక సదుపాయాలతో ప్రత్యేక అంబులెన్స్ (108)ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. స్థానిక జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు. ఇందులో అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి 45 రోజుల వయసు పసికందుల వరకు మెరుగైన వైద్యం కోసం రాష్ట్రంలో ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. వెంటిలేటర్ సదుపాయం కూడా ఉంటుంది. అత్యవసర సమయాల్లో బిడ్డను మెరుగైన వైద్యం కోసం అనంతపురం, కర్నూలు, తిరుపతి తదితర ప్రాంతాలకు ఎక్కువగా తీసుకెళ్తుంటారు. సాధారణంగా 108 వాహనాలైతే కొంత దూరం వెళ్లాక మరో వాహనంలోకి మార్చుతుంటారు. ప్రత్యేక అంబులెన్స్‌తో ఆ తిప్పలు తప్పనున్నాయి. పసిబిడ్డను ఎంతదైరమైనా తరలించవచ్చు. జిల్లాకు ఒక్కటే వాహనం ఉండటంతో ఒక బిడ్డను తీసుకెళ్లాక మరో పసికందుకు అత్యవసర పరిస్థితి తలెత్తితే ఎలాగన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆ వాహనం వచ్చేవరకు వేచి ఉండక తప్పదు.



చిన్నారిని ఆస్పత్రికి తీసుకొస్తున్న దృశ్యం

పాప కోసం..

అమ్మ వచ్చేసింది..!

కడసారి నిన్ను కళ్లారా చూసుకుని
ఎవరి చేతుల్లోనే పెట్టేసి వెళ్లిపోయాను..
ఇంక తిరిగిరాని తీరాలకు
తరలిపోవాలనే అనుకున్నాను..
విధి పగబట్టి వెంటాడుతుంటే..
భరించలేకపోయానే తల్లీ..!
కొడలిలో కూతుర్ని చూశారు..!
రాలిపోయిన పసుపు కుంకుమలను
ఇంకెక్కడో వెతుక్కోమన్నారు.. వెళ్లిపోయాను..!
ఎవడినో నమ్మి.. నిన్ను కన్నానే తల్లీ..!
వాడు బతుకునివ్వలేదు.. బతకనివ్వనూ లేదు..!
'వెళ్లిపోదామనుకున్నానే తల్లీ..!
నువ్వు గుర్తొచ్చి ఆగిపోయాను..!



కదిరి, అక్టోబరు 7: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం చిన్నారిని వదిలి వెళ్లిన తల్లి బిడ్డను వెదుక్కుంటూ వచ్చింది. సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతి అనే మహిళకు ఇదివరకే వివాహమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్త చనిపోవడంతో ఆ పిల్లలను ఆమె అత్తమామలు తీసుకెళ్లి, పోషిస్తున్నారు. దీంతో ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డబళ్లాపూర్ దగ్గర గల ఏతం గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తిని



పుట్టపర్తి శిశువిహార్‌కు పాపను అప్పగిస్తున్న దృశ్యం



చిన్నారి తల్లి జ్యోతికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రెండో వివాహం చేసుకుంది. వీరికి ఓ పాప జన్మించింది. భర్త వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఎవరికీ తెలియని చోటుకు వెళ్లాలని చంటిబిడ్డతో కదిరికి వచ్చింది. అక్కడే పని చేసుకుని బతకాలని నిర్ణయించుకుంది. అయితే వెంటాడే బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. దీంతో బస్టాండ్‌లో ఉన్న ఓ యువతికి ఇప్పుడే వస్తానంటూ పాపను అప్పగించి బయటకెళ్లిపోయింది. ఆమె ఎంతసేపటికి రాకపోవడంతో ఆయువతి పాప విషయం పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు అక్కడికి చేరుకుని చిన్నారిని ఐసీడీఎస్ వారికి అప్పగించారు. అయితే పాపా మీద బెంగతో ఆమె తిరిగి బస్టాండుకు వచ్చి వెదకసాగింది. ఆమెను గుర్తించిన పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె బంధువులకు సమాచారం అందించారు. కాగా చిన్నారిని అనంతపురంలోని చైల్డు వైల్ఫేర్‌కు తరలించారు. వారు సంరక్షణ కోసం పాపను పుట్టపర్తిలోని శిశువిహార్‌కు పంపినట్లు చెప్పారు.

సమాజంలో మార్పులపై అధ్యయనం చేయాలి

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 7: విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా సోమవారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో మార్పులు రోజురోజుకీ వేగంగా జరుగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో అశాస్త్రీయమైన భావాలను పాఠ్యపుస్తకాల్లో జొప్పిస్తోందని విమర్శించారు. చరిత్రను సైతం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏ పాత్రాలేని ఆర్ఎస్ఎస్ నాయకులను పోరాటయోధులుగా పాఠ్యాంశాలలో చేరుస్తున్నారన్నారు. విద్య మొత్తం కేంద్రం ఆధిపత్యంలోకి తెచ్చేందుకే నూతన విద్యా విధానం రూపకల్పన చేశారని, దీనివల్ల రాష్ట్రాల హక్కులు హరించబడతాయన్నారు. రాష్ట్ర సంస్కృతి, చరిత్ర కనుమరుగైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానాలను గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిందని, అయితే ఆ విధానాలను ప్రశ్నించిన టీడీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి మళ్లీ వాటినే అమలు చేయడానికి యత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఉపాధ్యక్షులు రామ్మోహన్, ఓతూరు పరమేష్, వినోద్‌నాయుడు, సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

టమోటా కిలో రూ.60



అనంతపురం రూరల్, అక్టోబరు 7: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.60తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.50, కనిష్ఠ ధర రూ.33 పలికినట్లు ఆయన తెలిపారు.

బడి పిలుస్తోందికి అవార్డుల పంట

లఘు చిత్రానికి ఎనిమిది అవార్డులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 7: అనంతపురం జిల్లాకు చెందిన కళాకారులు రూపొందించిన బడి పిలుస్తోంది లఘుచిత్రం 8 అవార్డులు కైవసం చేసుకుంది. బాల్య వివాహాలపై దర్శకుడు తరిమెల రాజు రూపొందించిన బడి పిలుస్తోంది లఘుచిత్రాన్ని సోమవారం విజయవాడలో నిర్వహించిన షార్ట్ ఫిలిం పోటీల్లో ప్రదర్శించారు. పోటీల్లో ఈ లఘుచిత్రానికి ఉత్తమ దర్శకత్వం, నటన, కథ, సంగీతం ఇలా మొత్తం 8 విభాగాల్లో అవార్డులు లభించాయి. అవార్డులు దక్కడం పట్ల తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఉచిత ప్రదర్శన

బాల్య వివాహాల నిర్మూలనే ధ్యేయంగా రూపొందించిన బడి పిలుస్తోంది సందేశాత్మక లఘుచిత్రాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్-మ్యాక్స్ థియేటర్‌లో ఉదయం 8.30 గంటలకు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు చిత్ర దర్శకుడు తరిమెల రాజు వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ చిత్రాన్ని వీక్షించాలని కోరారు.



అందుకున్న అవార్డులతో చిత్ర బృందం

సాయం.. ఇంకెప్పుడు ?



అప్పుల బాధతో రైతుల ఆత్మహత్య

- కుటుంబాలకు అందని చేయూత
- ఎన్నికల కోడ్‌తో రైతు బీమా పోర్టల్ బంద్
- కొత్త ప్రభుత్వం కొలువుదీరినా ఓపెన్ కాని పోర్టల్
- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చేదెన్నడో..?
- ఆర్థిక సాయం కోసం 24 బాధిత రైతు కుటుంబాల నిరీక్షణ

అనంతపురం అర్బన్, అక్టోబరు 7: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. కుటుంబం పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఆయా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అలాంటి కుటుంబాలకు సత్వర సాయం అందించాల్సి ఉండగా గత సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలుతో బ్రేక్ పడింది. కోడ్ కారణంగా రైతు బీమా పోర్టల్‌ను బంద్ చేశారు. అప్పటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల అప్‌లోడ్ ఆగిపోయింది. ఎన్డీఏ కూటమి కొలువుదీరి వంద రోజులు దాటినా ఇప్పటి దాకా రైతు బీమా పోర్టల్‌ను తిరిగి ఓపెన్ చేయలేదు. ఈ పరిస్థితుల్లో బాధిత రైతు కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి.

ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు ఇలా

రైతు పేరు	గ్రామం	మండలం
బ్రహ్మాచారి	ఉటకల్లు	గుత్తి మండలం
రామాంజినేయులు	శ్రీపురం	గుత్తి మండలం
రంగ	బసనేపల్లి	గుత్తి మండలం
నాగరాజు	గనిగెర	కణేకల్లు
పరమేశ్‌కుమార్	కొనకొండ్ల	వజ్రకరూరు
పోలేరయ్య	కందుకూరు	అనంతపురం రూరల్
కొడిమి ఓబులేసు	కందుకూరు	అనంతపురం రూరల్
భాస్కర్	నీలారెడ్డిపల్లి	బుక్కరాయసముద్రం
వెంకటరాముడు	దయ్యాలకుంటపల్లి	బుక్కరాయసముద్రం
సంగప్ప	కడదరకుంట	కూడేరు
గోపాల్‌రెడ్డి	పులిప్రొద్దుటూరు	పుట్లూరు
రాజశేఖర్‌రెడ్డి	పుట్లూరు	పుట్లూరు
మల్లికార్జున	మర్తాడు	గార్లదిన్నె
బాలకృష్ణ	కులికంటిపల్లి	శింగనమల
సంజీవ్‌కుమార్	వెస్ట్‌నరసాపురం	శింగనమల
నాగన్న	నార్పల	నార్పల
శ్రీధర్	నార్పల	నార్పల
చిన్నవన్నూరప్ప	హావళిగి	విడపనకల్లు
గోవిందు	పెద్దవడుగూరు	పెద్దవడుగూరు
ఓబన్న	టి.వీరాపురం	రాయదుర్గం
సురేష్	రాళ్లఅనంతపురం	కంబదూరు
ఆదిశేషయ్య	యర్రగుంటపల్లి	తాడిపత్రి
గౌడే శ్రీకాంత్‌రెడ్డి	పుల్లంపల్లి	కణేకల్లు
చెన్నప్ప	చీకలగురికి	విడపనకల్లు

రైతు బీమా పోర్టల్ ఓపెన్ ఎప్పుడో..?

గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి దాకా జిల్లా వ్యాప్తంగా 23 మంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నారు. అలాగే 2022 సంవత్సరంలో విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన రైతు చెన్నప్ప అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పటి దాకా కనీసం మ్యాన్యువల్‌గా కూడా స్థానిక అధికారులు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఫైల్ పంపలేదు. రాజకీయ కారణాలతోనే ఫైల్ పంపలేదని సమాచారం. ఎన్నికల కోడ్‌కు ముందు పోర్టల్ ఓపెన్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల విధుల్లో అధికారులు హడావుడిగా ఉండటంతో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు. ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి పోర్టల్ బంద్ కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బాధిత కుటుంబాలు మండల స్థాయి అధికారులను పలు మార్లు కలిసినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అధికారులు సకాలంలో ఆన్‌లైన్‌లో పనులు పూర్తి చేస్తే జిల్లా అధికారుల నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల వద్దకు చేరిన రెండు మాసాల్లో బాధిత రైతు కుటుంబాల్లోని నామినీ ఖాతాకు రూ.7లక్షలు జమ అవుతుంది. జిల్లా వ్యాప్తంగా అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న 24 బాధిత కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాయి.

టీడీపీ వాళ్లమని పట్టించుకోలేదు



నా భర్త చెన్నప్ప 2022 సంవత్సరంలో అప్పుల బాధ తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మాకున్న నాలుగు ఎకరాలతోపాటు పదెకరాలు కౌలుకు తీసుకొని వేరుశనగ, మిరప పంటలు సాగు చేసేవాళ్లం. ఐదేళ్లు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసిన నష్టం వచ్చింది. పంటల సాగు కోసం రూ.10 లక్షలు అప్పులు అయ్యాయి. వీటిని తీర్చే మార్గం కానరాక, తీర్చకపోతే ఊర్లో మర్యాద పోతుందన్న బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అధికారులెవరూ మా ఇంటి వద్దకు రాలేదు. నా కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వస్తుందని ఊర్లో వాళ్లు చెప్పడంతో స్థానిక అధికారుల వద్దకు వెళ్లి అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. మేము టీడీపీ వాళ్లమనే ఉన్నతాధికారులకు ఫైల్ పంపలేదంట. అప్పుల బాధతో నా భర్త చెన్నప్ప ఆత్మహత్య చేసుకోవడంతో దిక్కులేని వాళ్లమయ్యాం. అప్పు చేసి కుమార్తెకు పెళ్లి చేశా. కుమారుడితో కలిసి రోజూ కూలి పనులకు వెళుతూ బతుకుతున్నాం. నా భర్త చేసిన అప్పుల ఎలా తీర్చాలో తెలియడం లేదు. ఇప్పటికైనా మా కుటుంబానికి రావాల్సిన ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

- రత్నమ్మ, బాధితురాలు, చీకలగురికి, విడపనకల్లు మండలం

కొత్త ప్రభుత్వమైనా ఆదుకోవాలి



నా భర్త సంగప్ప అప్పుల బాధతో ఈ ఏడాది ఏప్రిల్‌లో మా తోటలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మాకు ఉన్న రెండున్నర ఎకరాలతో పాటు పదెకరాల కౌలుకు తీసుకొని వేరుశనగ, మిరప, ఆముదం, వరి పంటలు సాగు చేసేవాళ్లం. పంటల సాగు చేసేందుకు నా భర్త రూ.5 లక్షలు అప్పు చేశాడు. వడ్డీతో రూ.6 లక్షలకు అప్పు పెరిగింది. పంట దిగుబడులు రాకపోవడంతో చేసిన అప్పులు చెల్లించే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. ప్రతి రోజూ కూలి పనులకు వెళ్లి, ఆ డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తున్నా. అప్పులోళ్ల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంది. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. అధికారులు వివరాలు రాసుకొని వెళ్లినా ఇంకా ఆర్థిక సాయం అందలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

- మంజుల, కడదరకుంట, కూడేరు మండలం

అనంతలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయండి

భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు ఎంపీ అంబికా వినతి

అనంతపురం అర్బన్, అక్టోబరు 7: జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం కర్నూలులోని ఆయన నివాసంలో మంత్రి టీజీ భరత్‌ను ఎంపీ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం కరువు జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని విన్నవించారు. జిల్లా లో పరిశ్రమల స్థాపన ఆవశ్యకతను ఆయనకు వివరించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ జిల్లాలో త్వరలో ఆజాద్ బస్సులు తయారు చేసే పరిశ్రమ రాబోతోందని స్పష్టం చేశారు. కరువు జిల్లాలో మరిన్ని పరిశ్రమలు స్థాపనకు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రిని సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నేటి నుంచి డిగ్రీ ఇయర్‌వైజ్ పరీక్షలు



అనంతపురం సెంట్రల్, అక్టోబరు 7: ఎస్కేయూ ఆధ్వర్యంలో 1994 నుంచి 2014వరకు డిగ్రీ ప్రవేశాలు పొంది ఫెయిల్ అయిన విద్యార్థులకు మంగళవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇయర్ వైజ్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు వివిధ రంగాల్లో పని చేస్తున్నారన్నారు. వారు ప్రమోషన్‌లు పొందాలన్నా, కొత్త ఉద్యోగాల్లో చేరాలన్నా ప్రస్తుత పరిస్థితుల్లో కనీస అర్హతగా డిగ్రీ పాస్ అయివుండాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని ఇయర్‌వైజ్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారందరికీ మెగా సప్లిమెంటరీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 4వేలమంది ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి డిగ్రీ బీఏ, బీఎస్సీ, బీకామ్ పరీక్షా ఫీజులు చెల్లించారని తెలిపారు. వారందరూ పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. బీకామ్ విద్యార్థులకు ఎస్కేయూలో, బీఏ విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలో, బీఎస్సీ విద్యార్థులకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. హాల్‌టికెట్స్ రానివారు, ఇతర సమస్యలున్న వారు ఎస్కేయూ ఎగ్జామినేషన్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులు చేపట్టండి: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7: అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని డీపీఓ నాగరాజునాయుడు సిబ్బందిని ఆదేశించారు. అనంతపురం రూరల్, రాప్తాడు, బుక్కరాయసముద్రం మండలాల్లోని పంచాయతీ సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. డీఎల్‌పీఓ సుమన జయంతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ మాట్లాడుతూ పంచాయతీల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు గుర్తించి, వాటిని వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించిన నిధుల కోసం అంచనాలు తయారు చేసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రజలకు ప్రధాన సమస్యగా ఉన్నవాటిని గుర్తించి, పరిష్కరించాలన్నారు. అందుకు అనుగుణంగా పీఆర్-1 యాప్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ సుమన జయంతి మాట్లాడుతూ పంచాయతీల్లో ఆర్వో ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని, నీటి సమస్య పరిష్కారం కోసం బోరుబావులు తవ్వించాలని, శ్మశాన వాటికల్లో సదుపాయాలు కల్పించాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు అందాయి. వీటిలో పీఆర్ నుంచి ఏవి చేపట్టాలి? ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఏవి చేపడతారన్నది చర్చిస్తామన్నారు. సమావేశంలో ఏఓ సోమశేఖర్, ఈఓఆర్డీలు సదాశివ, ఆనంద్‌ప్రసాద్, వెంకటనాయుడు, సెక్రటరీలు అశోక్‌బాబు, పెద్ద శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, హిదయతుల్లా, మూడు మండలాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఇంకా ఆ కంపే నా..?

- వైసీపీతో అంటకాగిన అధికారులదే మళ్లీ పెత్తనం
- తహసీల్దార్, ఎంపీడీఓ ఆఫీసుల్లో వారిదే రాజ్యం
- అక్రమ వ్యవహారాలతో రూ.లక్షల్లో ఆర్జన
- ప్రజలకు సకాలంలో అందని ప్రభుత్వ సేవలు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 7: మండల పరిషత్తు కార్యాలయాలు, తహసీల్దారు కార్యాలయాల్లో ఇంకా పాత వాసనలు పోవడం లేదు. కొందరు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అప్పటి ప్రజాప్రతినిధి కనుసన్నల్లో నిబంధనలకు పాతరేసి, పాలన అంతా భ్రష్టుపట్టించారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత కూడా అప్పటి సిబ్బందే పెత్తనం చెలాయిస్తుండటంతో పాలన గాడిలో పడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలల దాటినా వైసీపీ పాలనలో పనిచేసిన అధికారులే ఇంకా కీలకంగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది. కంబదూరు మండల పరిషత్తు కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, ఎమ్మార్సీల్లో పాతుకుపోయిన ఆ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదు.

పట్టా పాసుపుస్తకాలతో రూ.లక్షల ఆర్జన?

కంబదూరు తహసీల్దారు కార్యాలయంలో ఆ అధికారికి ఎదురే లేదు. వైసీపీ పాలనలోను, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ ఆయన అధికారానికి అడ్డు లేదు. అక్రమ మార్గంలో పట్టాదారు పాసుపుస్తకాలను చేయిస్తూ, లక్షలాది రూపాయలు ఆర్జించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీఆర్వోలతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. జగనన్న లే అవుట్‌లో స్థలాలను కూడా అనర్హులకు అమ్ముకున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకుని అక్రమంగా భూములను వారి పేరుమీద చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం రహస్యంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి, రేటు కూడా నిర్ణయించుకున్నాడని తెలిసిం ది. ఆ అధికారి కనుసన్నల్లో వీఆర్వోలు పని చేస్తూ, ఒక్కొక్క పనికి ఒక్కో రేటును నిర్ణయిస్తున్నారు.



కంబదూరు ఎంపీడీఓ కార్యాలయం

దళారులతో కుమ్మక్కై వసూళ్లు

చుక్కల భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి ఎన్‌వోసీల కోసం అర్హులైన రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై, భూములకు సంబంధించిన పాత రికార్డులను వెతుకుతూ ఆ వివరాలను రైతులకు చూపుతున్నారు. ఎన్‌వోసీలు ఇప్పించే బాధ్యత తమదని, అందుకు కొంత ఖర్చు అవుతుందని భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయ పని వేళలు ముగిశాక, దళారీలతో రహస్యంగా సమావేశమవుతున్నట్లు సమాచారం. ఈ ఎన్‌వోసీల పేరుతో లక్షలు చేతులు మారుతున్నట్లు సమాచారం. అర్హుల జాబితాలో రైతు పేరు ఉన్నా, ఆ విషయం బహిర్గతం కాకుండా దాచిపెడుతున్నారు. ఇలా దాచిపెట్టి తర్వాత మంజూరైయిందంటూ కూడా వసూళ్లకు పాల్పడుతున్నారు.

ఎంపీడీఓ ఆఫీసులో ఆయనదే హవా..!

కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా విధులు నిర్వహించారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు కూడా అక్కడ ఆ అధికారిదే హవా. ఎలా పడితే అలా పనులు చేయిస్తూ, అందినకాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిధులు దారి మళ్లించి, వాటిని సక్రమంగా ఎలా కాజేయాలన్న విషయం లో సిద్ధహస్తుడిగా ఆయన పేరు సంపాదించారు. ఎంబుక్కుల రికార్డుల్లో కూడా ఎలా పడితే అలా నమోదు చేయించి, ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరులు ఎలా సృష్టించుకోవాలో నేర్పుతాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంబుక్కులను కళ్యాణదుర్గం పట్టణానికి తీసుకెళ్లి అక్కడ సంతకాలు చేసి, వాటాలు కుదుర్చుకుంటున్నారని తెలిసింది. కళ్యాణదుర్గం, అనంతపురం కేంద్రంగా చేసుకుని ఆ అధికారి అక్కడ ఎంబుక్కుల్లోను, రికార్డుల్లోనూ సంతకాలు చేయించుకుంటున్నారని తెలిసింది. అక్కడే పనిని బట్టి రేటును నిర్ణయించి డబ్బులు వసూలు చేసుకుంటున్నారని ఈ కార్యాలయంలో ఇదే చర్చనీయాంశంగా మారింది. ఆ అధికారి అటు వైసీపీ నాయకులతోను, ఇటు టీడీపీ నాయకులతోను జత కట్టేసి, దోచుకునే పనిలో నిమగ్నం అయ్యాడు. ఆ అధికారిపై అవినీతి ఆరోపణలు భారీగా వెల్లువెత్తుతున్నా, సంబంధిత ఉన్నతాధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

చీనీ టన్ను రూ.26వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.26వేలు, కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు 15టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పేద ఖైదీల కోసం కమిటీ ఏర్పాటు చేయాలి

● కలెక్టర్ టీఎస్ చేతన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, అక్టోబరు 7: పేద ఖైదీలకు సాధికార కమిటీ ఏర్పాటుచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 171 ఫిర్యాదులు స్వీకరించారు. పారదర్శకంగా ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పేదఖైదీలకు సాధికార కమిటీ ఏర్పాటుపై జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. కేంద్రహోంశాఖ భారతప్రభుత్వం పేదఖైదీల మద్దతు కోసం పథకాన్ని రూపొందించిందని తద్వార ఆర్థికసహాయం అందచేస్తారన్నారు. ఖైదీలపై విధించిన జరిమానా చెల్లించలేకపోవడం బెయిల్‌పై విడుదలయ్యే ఖర్చులను చెల్లించలేని పేద ఖైదీలకు కేంద్రప్రభుత్వమే ఆర్థికంగా సహాయం చేస్తుందన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 7: ఫిర్యాదుదారుల సమస్యలను ప రి ష్కరించడమే ధ్యేయమని, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్పీ రత్న పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులనుంచి 32 ఫిర్యాదులను స్వీకరించారు. విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, లీగల్‌సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్సై ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం: డీఎస్పీశ్రీనివాసరావు విధినిర్వహణలో సమర్థవంతంగా పనిచేశారని ఎస్పీ వీ రత్న కొనియాడారు. సోమవారం స్థానిక జిల్లాపోలీసుకార్యాలయంలో పుట్టపర్తి ఇన్‌చార్జి డీఎస్పీగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా డీఎస్పీకి ఆత్మీక వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

రైతుల భద్రతే ధ్యేయం

బత్తలపల్లి అక్టోబరు 7: రైతుల భద్రతే కూటమి ధ్యేయమని మంత్రి సత్యకుమార్ కార్యాలయ ఇన్‌చార్జి హరీష్ పేర్కొన్నారు. మండలంలోని తంబాపురం గ్రామంలో జనసేన కార్యకర్త రమణారెడ్డి చెందిన చీనీ చెట్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసిన విషయం తెలుసుకున్న హరీష్ సోమవారం ఆ చెట్లను పరిశీలించి రైతును పరామర్శించారు. బీజేపీ కన్వీనర్లు వీరనారప్ప, రవి పాల్గొన్నారు.

సీపీఎం శాంతిర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ, అక్టోబరు7: ఇజ్రాయెల్‌లో యుద్ధం ఆపాలని సీపీఎం మండల నాయకులు సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్‌పై జరిగిన దాడికి, ప్రతీకార దాడి పేరుతో విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులకు స్వస్తిపలకాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీయం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, బండల వెంకటేష్, పోతలయ్య, నౌషాద్, కాంగ్రెస్ పార్టీ పీసీసీ డిలిగెట్ నిషార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

నల్లమాడ, అక్టోబరు 7: విజయవాడ వరద బాధితులకోసం రూ.20వేలు ఆర్థిక సాయం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి చెక్కును అందించినట్లు నల్లమాడ పంచాయతీ సర్పంచ్ రామావత్‌భారతి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ వరదల్లో నష్టపోయిన బాధితులకు తనవంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకుందాం

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 7: వన్యప్రాణులను సంరక్షించుకుందామని ఫారెస్టుసెక్షన్ ఆఫీసర్ చంద్రానాయక్ పిలుపిచ్చారు. సోమవారం జగరాజుపల్లి నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అటవీశాఖాధికారి మాట్లాడుతూ అటవీ ప్రాంతం నుంచి గ్రామాల సరిహద్దులలోకి వస్తున్న వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టకుండా సమీపగ్రామప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉందన్నారు. సెక్షన్ ఆఫీసర్ చిన్నప్పయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ

నల్లమాడ, అక్టోబరు 7: మండలంలోని రాగానిపల్లి గ్రామపెద్దల ఆధ్వర్యంలో శివాలయాన్ని పునఃప్రారంభించారు. ఆలయంలో శివపార్వతుల విగ్రహాలను సోమవారం వేద మంత్రోచ్చారణల నడుమ కర్ణాటకకు చెందిన పండితులు ప్రతిష్ఠించారు. మూడురోజులపాటు హోమా లు, భజనలతో ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహించామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న పారిశ్రామికవేత్త



అమ్మవారికి పూజలు చేస్తున్న పారిశ్రామికవేత్త సందీప్

బత్తలపల్లి అక్టోబర్ 7: మండల కేంద్రంలోని అమ్మవారు సోమవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హైదారాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త సందీప్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మండపం వద్ద 3వేల మందికి అన్నదానం నిర్వహిచారు. అంతకు ముందు గ్రామములోని బళ్లారి దుర్గమ్మగుడి వద్ద నుంచి ఊరేగింపుగా అమ్మవారి మండపం వద్దకు వచ్చారు. జక్కంపూటి సత్యనారాయణ, రంగానాయుడు. భాస్కర్, ఓబుళనాయుడు, సతీష్, వినయ్ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



జేసీబీని నడిపి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, అక్టోబరు 7: కదిరి నియోజకవర్గాన్ని ఆదర్శనియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని గద్దలబండతండానుంచి ఎర్రగుట్టపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీమేరకు గద్దలబండతండా, గేమేనాయక్‌తండా తదితర తండా గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి రూ.2.50కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇచ్చిన హామీకి కట్టబడి వంద రోజుల్లోనే అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గిరిజన, దళితవాడల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయడానికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభమైందన్నారు. రూ.2.50కోట్ల నిధులు సరిపోకపోతే, మరిన్ని తీసుకువచ్చి పూర్తిస్థాయిలో ఎర్రగుట్టపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడునెలల్లోనే ఒక్కొక్కమండలానికి ఉపాధి పథకం ద్వారా రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. కూటమి కుటుంబ సభ్యులను తన కుటుంబ సభ్యులాగా చూసుకుంటామన్నారు. సర్పంచ్ కాంతమ్మ, టీడీపీ ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్, తెలుగుయువత ప్రవీణ్, బ్రహ్మానందరెడ్డి, హరినాయక్, ఆనంద్‌రెడ్డి, మల్లిరెడ్డి, మహబూబ్ బాషా, దస్తగిరి, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ మరియమ్మ, ఏపీఎం జయంతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ: మండలంలోని సింగిరివాండ్లపల్లి గ్రామంలో మూడురోజులక్రితం టీడీపీ కార్యకర్త నాగరాజు మృతిచెందారు. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే కందికుంట సోమవారం ఆ గ్రామానికెళ్లి నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



భాస్కర్‌నాయుడు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ,అక్టోబరు 7: మండలంలోని సంకేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త భాస్కర్ నాయుడు(52) ఆదివారం బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సోమవారం సంకేపల్లి గ్రామానికి చేరుకుని టీడీపీ కార్యకర్త మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు రమేష్ బాబు, కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, వినోద్ బాబు, చల్లా రంగయ్య చల్లా రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించాలి

నల్లమాడ, అక్టోబరు 7: జగనన్న కాలనీలో పట్టాలున్న పేదలకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సునితకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ఇళ్లస్థళాలు ఇచ్చి, పక్కాగృహాలు నిర్మిస్తామని చెప్పినా, ఒక్క ఇంటినికూడా నిర్మించలేదన్నారు. జగనన్న కాలనీలో ఏ లబ్ధిదారుడికి ఏ ప్లాంట్లు కేటాయించాలో తెలియడంలేదని, కనీసం ప్లాట్లు అయిన వారికి చూపించాలన్నారు. లేఅవుట్ చదును చేయడం కోసం రూ.80 లక్షలు ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభుత్వమైనా జగనన్నకాలనీలో పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని వారు కోరారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ, రైతు సంఘం జిల్లాసహాయ కార్యదర్శి చంద్ర, నాగేంద్ర, ఆదిలక్ష్మి, గంగాధర్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

కదిరి అర్బన్, అక్టోబరు 7: కొత్తగా మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కదిరి పరిధిలో 12 దుకాణాలకు ఇప్పటిరకు 31 దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 9న దరఖాస్తుకు చివరి తేదీ అన్నారు. ఆసక్తి ఉన్న టెండర్ దారులు దరఖాస్తులను వారింటివద్దనే కూర్చొని ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చన్నారు. గతంలోలాగా దరఖాస్తులు భర్తీ చేసి బారులు తీరాల్సిన అవసరం లేదన్నారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చన్నారు. రూ.2 లక్షల చొప్పున నాన్‌రిఫండ్‌బుల్ రుసుం చెల్లించాలన్నారు. టెండరు దారులకు సందేహాలుంటే ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించవచ్చన్నారు. 11న లక్కీడ్రా ద్వారా దుకాణాలు కేటాయిస్తామన్నారు. సమయం ఉందికదా అని నిర్లక్ష్యం చేసే చివరిరోజులు సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చని ముందుగానే దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓగా రఘునాథ్ గుప్తా

నల్లచెరువు, అక్టోబరు 7: ఎంపీడీఓగా రఘునాథ్‌గుప్తా సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోరంట్ల ఎంపీడీఓగా పనిచేస్తూ నల్లచెరువుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ శంకుతల పెద్దపప్పూరుకు బదిలీపై వెళ్లారు. ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి ఎంపీడీఓను కలిశారు. ఎంపీడీఓను నాయకులు దాద్దెం శివారెడ్డి, నరసింహారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీఎంగా గోపాల్ బాధ్యతలు

నల్లమాడ: మండల వెలుగు ఏపీఎంగా జి.గోపాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం జయంతి తనకల్లు ఏపీఎంగా బదిలీకావడంతో, అమడగూరు మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న గోపాల్ బదిలీపై ఇక్కడి వచ్చారు. వెలుగు సిబ్బంది, యానిమేటర్లు పూలమాలలు, దుశాలవతో సన్మానించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా నటరాజ్

కొత్తచెరువు: ఇన్‌చార్జి ఎంపీడీఓగా నటరాజ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ బారాన్‌సాబ్ అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హిందూపురంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న నటరాజ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

విగ్రహాల చోరీ కేసులో నిందితుల అరెస్టు

కదిరి, అక్టోబరు 7: విగ్రహాల చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు అమడగూరు ఎస్ఐ వెంకటనారాయణ సోమవారం తెలిపారు. అమడగూరు మండలం తుమ్మలకొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి పంచలోహవిగ్రహం, పద్మావతి అమ్మవారి విగ్రహం వెండి గొడుగు, వెండి ముఖకవచం, ఆగస్టు 27న చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మండలంలోని వెంకటనారాయణపల్లి క్రాస్ వద్ద సోమవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. పుట్టపర్తి మండలం నిడిమామిడికి చెందిన గంగరాజు, ఓబుళదేవరచెరువు మండలం మామిళ్లకుంటపల్లికి చెందిన నాగరాజులను అరెస్టు చేశామన్నారు. వారిని చోరీకిగురైన విగ్రహాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామన్నారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

కదిరి అర్బన్, అక్టోబరు 7: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు రూరల్ సీఐ మోహన్ సోమవారం తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక 5వ తేదీ అర్ధరాత్రి నుంచి కనిపించకుండాపోయిందన్నారు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించగా, ఆచూకీ లభించకపోవడంతో సోమవారం బాలిక తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అధికారులూ... దయచూపరూ..!

● నా స్థలం హద్దులు చూపండి ● శ్రీరాములు వినతి



అర్జీని చూపుతున్న శ్రీరాములు

ధర్మవరం రూరల్, అక్టోబరు 7: నాకున్న స్థలానికి సంబంధించి హద్దులు చూపాలని రెవెన్యూ అధికారులకు బాధితుడు కత్తే శ్రీరాములు విన్నవించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన శ్రీరాములు మాట్లాడుతూ గ్రామంలో మా తండ్రి చంద్రప్ప పేరుమీద 120-1సర్వేనెంబర్‌లో 32.50 సెంట్లు భూమి ఉందన్నారు. సబ్‌డివిజన్ కొలతలు వేసినప్పుడు రస్తాతో కలిపి 34 సెంట్లు ఇచ్చారన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 4 సెంట్ల స్థలాన్ని ఆక్రమించారని, వీటిపై కొలతలు వేసి మా స్థలాన్ని చూపించాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. మండలసర్వేయర్‌కు అర్జీని ఇస్తే ఆమె కూడా స్పందించలేదని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయండి

తనకల్లు, అక్టోబరు 7: ఫ్రీహోల్డ్ రైట్స్‌పై ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలని కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీటీ మల్లికార్జునకు వారు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల్లో ఫ్రీహోల్డ్ రైట్స్ ప్రభుత్వ భూములను మార్పే పద్ధతి కొనసాగుతోందన్నారు. కానీ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి ఫ్రీహోల్డ్ రైట్స్ భూములను వీఆర్వోలు ఎలాంటి కారణం చూపకుండా తిరస్కరిస్తున్నారని వాపోయారు. ఈ కారణంగా ఎస్సీ ఎస్టీలు తమ భూములు అమ్ముకునే వీలు లేకుండా పోతోందన్నారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ పారేసు, దళితనాయకులు శంకర్, నరసింహులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

కదిరి, అక్టోబరు 7: మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు కందికుంట నారాయణమ్మ కాలనీలో కొన్ని సంవత్సరాలుగా ప్రజలు లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లడంతో ఆయన స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని చెప్పగా, అధికారులు సోమవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో లోఓల్టేజి సమస్య పరిష్కారమయ్యింది. ఏడీ షాజహాన్, ఏఈ చిన్నికృష్ణ, వార్డు ఇన్‌చార్జి చైతన్య, నాయకులు మాబూ, శేషు, బండ్లనాయుడు, చెన్నకేశవ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్‌తో కలసి బియ్యం పంపిణీ చేస్తున్న మాజీమంత్రి పల్లె

వరద బాధితులకు 71 టన్నుల బియ్యం పంపిణీ

పుట్టపర్తి, అక్టోబరు 7: విజయవాడ వరదల్లో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు 71 టన్నుల ఆహారధాన్యాలను మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పంపిణీ చేశారు. సోమవారం పుట్టపర్తి నియోజకవర్గం నుంచి సేకరించి తరలించిన బియ్యాన్ని బాధితులకు అందజేశారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి పొత్తూరు, తాడేపల్లి, వేమవరం గ్రామాల్లో బాధితులకు పంపిణీచేశారు. అనంతరం గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలసి పాతపాడు, పెనయనవరం, అంబాపురం గ్రామాల్లో బాధితులకు బియ్యం పంపిణీ చేశారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు



రోడ్డుపై ధర్నా చేస్తున్న ప్రజలు

నల్లమాడ, అక్టోబరు 7: మండలంలోని బాపనకుంట, ఎస్సీకాలనీ, నేరాల వంకతండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు రెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో ధర్నా చేపట్టారు. సోమవారం వారు మాట్లాడుతూ బాపనకుంట సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. పనుల్లో భాగంగా అక్కడ బ్రిడ్జి నిర్మిస్తున్నారని, దీంతో సాయిబాబా తాగునీటి పైపులైన్ దెబ్బతినిందన్నారు. నాలుగు నెలలుగా ఆయా గ్రామాలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు పంచాయతీ నీరు కూడా గ్రామాలకు రావడంలేదన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన గ్రీన్‌ఫీల్డు హైవే మేనేజర్ సుధాకర్‌రెడ్డి రెండుమూడు రోజుల్లో పైపులైన్ మరమ్మతు చేసి తాగునీటి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు రాజశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, చెన్నారెడ్డి సుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రవీంద్రారెడ్డి, నాగమ్మ, గంగరత్న, గంగాదేవి, గంగులమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్



ధర్మవరం రూరల్, అక్టోబరు 7: ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న కమిషనర్ మల్లికార్జునను ప్రొద్దుటూరుకు బదిలీచేశారు. కడపజిల్లా జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రమోద్‌కుమార్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తనవంతుగా కృషి చేస్తానని, పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, పలువురు కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విదుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విరమించుకోవాలి

ధర్మవరం రూరల్, అక్టోబరు 7: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విరమించాలని ఆర్ఎస్‌పీ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలపేరుతో విద్యుత్ చార్జీల పెంపు రాష్ట్ర ప్రజలపై రూ.8,113కోట్లు ప్రతిపాదనలను ప్రభుత్వం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు తిప్పన్న, శ్రీరాములు, నరసింహులు, నరేంద్ర పాల్గొన్నారు.

మహాచండీ.. కరుణించు..!

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఐదో రోజు సోమవారం అమ్మవారు మహాచండీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. పుట్టపర్తి, ధర్మవరంలో గంగాభవాని మాత, కొల్లాపురమ్మ మహాచండీగా దర్శనమిచ్చారు. తనకల్లులో వాసవీమాత వేంకటేశ్వరస్వామి అవతారం, కదిరిలో మరకతమహాలక్ష్మి రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. - న్యూస్ నెట్‌వర్క్



పుట్టపర్తి: మహాచండీగా గంగాభవాని



ధర్మవరం: అలంకరణలో కొల్లాపురమ్మ



తనకల్లు: వేంకటేశ్వరుడి అలంకరణలో వాసవీమాత



బుక్కపట్నం: చాముండేశ్వరిగా వాసవీమాత

తాగునీటి కోసం తంటాలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- దేవస్థానం బోర్లను ఆశ్రయిస్తున్న సోమందేపల్లి వాసులు
- ఆమిదాలగొందిలోనూ తీవ్ర ఎద్దడి

పరిగి, అక్టోబరు 7: వర్షాకాలంలోనూ తాగునీటి కోసం ప్రజలు తంటాలు పడుతున్నారు. పరిగి పంచాయతీ పరిధిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. పంచాయతీ పరిధిలోని 90ఇళ్ల కాలనీలో దాదాపు ఆరు నెలల నుంచి కొళాయిల్లో నీటి చుక్కరాకపోవడంతో ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావు. డబ్బులు వెచ్చించి నీటి ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసి నిత్యవసరాలను తీర్చుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్నవారు సుదూర ప్రాంతంలో ఉన్న ఆలయం బోరువద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. నీటి సమస్యపై యువకులు పలుమార్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, వాటర్‌మెన్‌కు నీరు రావడంలేదని తెలిపినా స్పందన లేదని వాపోతున్నారు. పంచాయతీలో 10,500 మంది జనాభా ఉన్నారు. 28 బోర్లుండగా అందులో తొమ్మిది మరమ్మతులకు గురయ్యాయి. నీటి సమస్యపై సచివాలయాల చుట్టూ తిరుగుతూ సంబంధిత అధికారులకు వినతులు అందించినా, పలుమార్లు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ సర్పంచ్ లక్ష్మీదేవిని వివరణ కోరగా.. వాటర్‌మెన్లు సరిగా విధులు నిర్వహించకపోవడం, పైపుల మరమ్మతులు సరిగా చేయకపోవడం వల్ల సమస్య తలెత్తిందని తెలిపారు. సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

మడకశిర రూరల్ : మండలంలోని ఆమిదాలగొందిలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కేంద్రంలో ఉన్న బోర్లు చెడిపోవడంతో సమస్య ఏర్పడింది. ఎన్టీఆర్ కాలనీ ఉన్న బోరులో నీరు రావడంలేదు. ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న తాగునీటి పైపులైన్లు పగిలిపోవడంతో ఈ ప్రాంతానికి తాగునీరు రాలేదు. దీంతో గత 10 రోజుల నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కొంటున్న గ్రామస్థులు తెలిపారు. రెండు వారాల క్రితం గ్రామంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులు తాగునీటి సమస్యను విన్నవించారు. వెంటనే పరిష్కరిస్తామని అధికారులు చెప్పినా ఇంతవరకు పట్టించుకోలేదు. ఈవిషయమై ఆమిదాల గ్రామకార్యదర్శి వరదరాజులును వివరణ కోరగా.. పంచాయతీలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఎమ్మెల్యే ఆరు కొత్త బోర్లు మంజూరు చేయించారని, వాటిలో మూడు బోర్లు వేశామన్నారు. ఆమిదాలగొందిలో గ్రామంలో కొత్తబోర్లు వేయనున్నట్లు తెలిపారు.


పరిగిలో నీటి కోసం ద్విచక్రవాహనంలో ఫీట్లు, వృథాగా ఉన్న కొళాయి, ఆమిదాలగొందిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపండి : మంత్రి


వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, అక్టోబరు 7: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులు, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వైద్యులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్‌వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం చేయాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్యం అందించాలన్నారు. ఏదైనా ఆసుపత్రిలో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పెనుకొండ సూపరింటెండెంట్ మోహన్‌నాయక్, గుట్టూరు వైద్యుడు నాగరాజునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి: సీపీఐ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 7: గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు వెంటనే ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తూ నిర్వహించిన ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ శాంతి, సామరస్యాలతో చర్చించుకుని సమస్య పరిష్కరించుకోవాలి తప్పా ఇలా దాడులు చేసుకోవడం సరికాదని అన్నారు. ప్రాణనష్టంతో పాటు ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఇప్పటికే ఎంతో మంది పిల్లలు, మహిళలు మృతి చెందారన్నారు. ఎంతో మంది కటుంబ సభ్యులను కోల్పోయి అనాథలుగా మిగిలిపోయరన్నారు. వేల సంఖ్యలో అవిటివాళ్లుగా మారారని అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు బాబు, మారుతిరెడ్డి, నరసింహమూర్తి, సమీవుల్లా, గంగాధర్, కమల్‌బాష, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 66 దరఖాస్తులు

పెనుకొండ, అక్టోబరు 7: పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 13 మద్యం దుకాణాల నిర్వహణకు 66 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. సోమవారం ఒక్కరోజే 22 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. దరఖాస్తులు దాఖలు చేయడానికి ఈనెల 9న ఆఖరు రోజు అన్నారు. దరఖాస్తు దారుల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాఘవన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

10న జాబ్‌మేళా

పెనుకొండ, అక్టోబరు 7: స్థానిక పరిటాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి అధికారి హరిక్రిష్ణ, సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసుకలిగి 10, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లమో పూర్తీచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 9676706976 నంబరులో సంప్రదించాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, అక్టోబరు 7: మండలంలోని కల్లితండాకు చెందిన రాములుబాయి అనే వివాహిత క్రిమి సంహారక మందు తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కల్లితండాకు చెందిన కృష్ణానాయక్ భార్య రాములుబాయి మధ్య కుటుంబ కలహాలతో ఆమె మనస్థాపంతో ఆత్మహత్యకు యత్నించింది. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన చికిత్సకోసం హిందూపురం తరలించారు.

పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి

పెనుకొండ రూరల్, అక్టోబరు 7: నల్లరేగడి భూములు కలిగిన రైతులు ప్రభుత్వం రాయితీతో అందించే పప్పుశనగ విత్తనాల కోసం ఆర్బీకే కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రొద్దం మండల వ్యవసాయాధికారి నివేదిత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నల్లరేగడి భూములు కలిగిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకే కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జేబీ-11 రకం క్వింటాల్ మార్కెట్‌లో రూ.9400 ఉండగా ప్రభుత్వం రాయితీతో రూ.7050కు ఇస్తోందన్నారు. ఎకరాకు 20 కిలోల చొప్పున పదెకరాల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

స్థలం కేటాయించండి

సోమందేపల్లి, అక్టోబరు 7: మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో సర్వేనంబరు 78, 64లో ఉన్న ప్రభుత్వ భూమిలో రామాలయ నిర్మాణానికి పది సెంట్ల స్థలాన్ని కేటాయించాలని కాలనీవాసులు మంత్రి సవితను కలిసి సోమవారం ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాలయం నిర్మాణానికి కాలనీ ప్రజలు ముందుకొచ్చారన్నారు. దాతల సహకారంతో నిర్మాణాన్ని చేపట్టేందుకు పెద్దలు అంగీకరించిన నేపథ్యంలో స్థలం కోసం మంత్రికి వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

ఈఓఆర్‌డీల బాధ్యతల స్వీకరణ

గోరంట్ల/సోమందేపల్లి అక్టోబరు 7: గోరంట్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా శివన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్ ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. లేపాక్షి మండల ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న శివన్నను గోరంట్లకు బదిలీ చేశారు. సోమందేపల్లి నూతన ఈఓఆర్డీగా లక్ష్మీనరసమ్మ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీగా శ్రీధర్ వ్యవహరిస్తుండేవారు. కూడేరు నుంచి ఆమె బదిలీపై వచ్చారు.

బోరు వేయించిన మంత్రి

సోమందేపల్లి, అక్టోబరు 7: మండలకేంద్రంలో తాగునీటి సమస్యను నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో నూతన బోర్లు వేయించడానికి మంత్రి సవిత ఆదేశించారు. ఆ మేరకు పాతూరు శివనగర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి బోరు వేయించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుక వేసిన బోరులో మూడు ఇంచీలు పడటంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరి, సూర్యనారాయణ, డీవీ ఆంజనేయులు, కిష్టప్ప పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి

పావగడ, అక్టోబరు 7 : రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్నున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేతికందిన పంటలకు నష్టం వాటిల్లిందని, రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించేలా మంత్రులు ప్రభుత్వంతో చర్చించి రైతులకు న్యాయం చేయాలని తెలిపారు. ఈ సం దర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజప్ప, నాయ కులు చిత్తయ్య, ఈరన్న, జోగ్యానాయక్ పాల్గొన్నారు.

నేడు చెరువు వేలం

అగళి, అక్టోబరు 7: మండలంలోని కొమరేపల్లి పంచాయతీ చెరువులో చేపల పెంపకం కోసం వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్, సర్పంచ్ రామన్న తెలిపారు. చెరువు కట్ట ఆంజనేయస్వామి గుడి వద్ద మంగళవారం ఉదయం 11గంటలకు వేలం వేయనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేలు ధరావతు చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్నవారు పూర్తీ మొత్తాన్ని చెల్లించాలని తెలిపారు.

పాహిమాం.. పరమేశ్వరీ..!


హిందూపురంలో గజలక్ష్మిగా వాసవీమాత, సంతానలక్ష్మిగా చౌడేశ్వరీదేవి, పెనుకొండలో ధనలక్ష్మి రూపంలో కన్యకాపరమేశ్వరి, మడకశిరలో అలంకరణలో అమ్మవారు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు ఆలయాల్లో అమ్మవారి శోభ సంతరించుకుంది. సోమవారం ఉదయం నుంచి అమ్మవారి మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురం పట్టణం నింకంపల్లి రోడ్డులోని యల్లమ్మ ఆలయంలో శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. సాధుచెట్టి సంఘం ఆధ్వర్యంలో మెయిన్ బజార్ వద్ద ఉన్న జలదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని చింత విత్తనాలతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు. కొటిపి రోడ్డులోని బెస్త సంఘ ఆధ్వర్యంలో మహాచండీదేవిగా గంగమ్మ ముస్తాబయ్యారు. ఆర్యవైశుల ఆరాధ్యదైవం వాసవీమాత గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొల్హాపురమ్మ ఆలయంలో అమ్మవారిని స్కందమాతా దేవిగా కొలువుదీర్చారు. ముద్దిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరిమాత ఆలయంలో తొగటవీర క్షత్రీయుల ఆధ్వర్యంలో అమ్మవారు సంతానలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెనుకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మీ రూపంలో, లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి వారిని రామావతార రూపంలో అలంకరించారు. చంద్రగిరి గ్రామంలో వెలసిన శ్రీగిరి శక్తిపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ పీఠాధిపతి దేవేంద్రస్వామి తెలిపారు. మహాచండి అలంకరణలో మహేశ్వరిమాతగా అలంకరించారు. మడకశిర మండలం చందకచర్ల గంగమ్మదేవి, కల్లుమర్రి కేతమ్మదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మడకశిరలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో కొలువు దీరారు. గంగా పూజమ్మ, కొల్లాపురమ్మ, వడిసిలమ్మ, ఊరిమారమ్మ తదితర దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేయించండి

పెనుకొండ/పెనుకొండ రూరల్, అక్టోబరు 7 : పెనుకొండ, రొద్దం మండలాల్లో అనేక అంగనవాడీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని సీఐటీయూ నాయకులు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు బాబావలి, తిప్పన్న తదితరులు మంత్రితో మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరుకున్న అంగనవాడీ భవనాల పైపెచ్చులూడి పిల్లలపై పడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరి, మహేష్, పద్మా, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు. మడకశిర రహదారిలో మెడికల్ కళాశాల ఎదురుగా వైసీపీ ప్రభుత్వం హయాంలో వేసిన అహుడా లేఅవుట్‌ను రద్దుచేసి నిరుపేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని బీజేపీ నాయకులు రామక్రిష్ణ, రామాంజనేయులు, రవి, మధుసుధన్ కోరారు. మంత్రి సవిత, ఆర్డీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఎదురుగా గొర్రెల పెంపక క్షేత్రం భూమిని వైసీపీ హయాంలో చేసుకున్నాని లేఅవుట్ వేశారన్నారు. అందులో వైసీపీ నాయకులకే ప్లాట్లు ఇచ్చారన్నారు. దానిని రద్దుచేసి పట్టణంలోని ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని మంత్రిని కోరారు.


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

చెరువుకు గండి.. నీరు వృథా

గోరంట్ల, అక్టోబరు 7: మండంలోని మల్లాపల్లి చెరువుకు గండి పడడంతో తూము వద్ద నీరు వృథాగా పోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నాలుగు రోజుల క్రితం చెరువు మరవ వెళ్లినట్లు రైతులు తెలిపారు. రెండేళ్లుగా చెరువు నిండకపోవడంతో తూమువద్ద కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. 430 ఎకరాల ఆయకట్టు ఉండడంతో చెరువు నిండిన కారణంగా రైతులు సాగు చేయాలని తూమువరకు కంపచెట్లను తొలగించారు. దీంతో గండిపడిన విషయం తెలిసింది. తూము వద్ద చెరువు లోతట్టు ప్రాంతంలో పక్కన గండి పడి తూముగుండా నీరు వృథా అవుతున్నాయని రైతు మహమ్మద్ ఫిరోజ్ బాషా తెలిపారు. ఆప్రాంతానికి ఎక్స్‌కవేటర్ వెళ్లడానికి వీలు లేదని, ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారులకు తెలపడానికి ఫోన్ చేయగా, అందుబాటులోకి రాలేదన్నారు. తహసీల్దార్ మారుతి విషయం తెలుసుకుని వెంటనే మల్లాపల్లి చెరువును రైతులతో కలిసి పరిశీలించారు. గండి పూడ్చడానికి అవసరమైన 500 ఖాళీ సంచులను సమకూర్చారు. గ్రామంలోని ప్రతి రైతు ఖాళీ సంచులతో గండి పూడ్చడానికి సమాయత్తం కావాలని మైక్ ద్వారా తెలిచేశామన్నారు.


తూముగుండా వృథా అవుతున్న నీరు, పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతి

జీవవైవిధ్యాన్ని సంరక్షించుకోవాలి

చిలమత్తూరు, అక్టోబరు 7: భూమిపై మనుషులతో పాటు అనేక రకాల జీవ జాతులు మనుగడ సాగిస్తున్నాయని, వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని జీవ వైవిధ్య సంరక్షణ బృంద సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వీరాపురం గ్రామంలో బయోడైవర్సిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ చెన్నకేశవనాయక్ ఆధ్వర్యంలో జీవవైవిధ్యం-సంరక్షణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సైబీరియన్ వలస పక్షుల సంరక్షణపై గ్రామస్థులతో మాట్లాడారు. ప్రతి ఏటా ఎన్ని పక్షులు గ్రామానికి వస్తాయి? వాటి జీవనశైలిలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? వాటికి ఏదైనా ప్రమాదాలు పొంచి ఉన్నాయా? వాటి సంరక్షణ ఎలా జరుగుతోంది? అనే విషయాలపై ఆరా తీసారు. ఈ ప్రాంతాన్ని బయోలాజికల్ హెరిటేజ్ సైట్‌గా ప్రకటించడం హర్షించతగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామలింగయ్య, సాల్మన్ రాజ్, పర్యావరణ వేత్త భాస్కరరెడ్డి, సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, కార్యదర్శి కేశవమూర్తి, గోవిందప్ప, భగత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


వీరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జీవ వైవిధ్య సంరక్షణ బృందం

వైభవంగా దసరా ఉత్సవాలు చేసుకుందాం

కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర్

పావగడ, అక్టోబరు 7 : విశ్వ విఖ్యాత మైసూరు దసరా పర్వదినంతోపాటు తుమకూరు జిల్లాలో కూడా దసరా ఉత్సవాలను వైభవంగా జరుపుకొందామని కర్ణాటక హోంమంత్రి, తుమకూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ తెలిపారు. సోమవారం తుమకూరు పట్టణంలోని మహాత్మాగాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మహిళల ముగ్గుల పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల్లో మహిళలకు కల్పించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవడంతో వారు ఆత్మ స్థైర్యంతో రాణిస్తున్నారని తెలిపారు. చెట్లను తమ బిడ్డలుగా భావించి అడవిగా పెంచిన వృక్షమాత సాలు మరద తిమ్మక్క దేశానికే స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టర్ కల్యాణి కొనియాడారు. వివిధ ఆటల పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ ఈఓ ప్రభు, ఎస్పీ అశోక్‌కుమార్, మేయర్ అశ్వీజ, పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్, తుమకూరు ఎమ్మెల్యే జ్యోతి గణేష్, రూరల్ ఎమ్మెల్యే సురేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న హోంశాఖ మంత్రి పరమేశ్వర్, అధికారులు

ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గోరంట్ల, అక్టోబరు 7: ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలోని మందలపల్లి, బూచేపల్లి, గంగంపల్లి, బూదిలి, గంగంపల్లి తండా, గోరంట్ల గ్రామాలకు చెందిన ఇళ్లు లేనివారు స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, నెలలు గడుస్తున్నాపట్టించుకోలేదన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దన్న, స్వర్ణలత, ఆంజనేయులు, వెంకటేష్, రామాంజనేయులు, గీతమ్మ, నందిని, రేఖ, ఖైరూన్‌బీ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

రొళ్ల/మడకశిరటౌన్, అక్టోబరు 7 : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని, ఏఒక్క హామీని నెరవేర్చడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉష శ్రీచరణ్ అన్నారు. సోమవారం రొళ్ల మండలం హనుమంతనపల్లిలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్ స్వగృహంలో వైసీపీ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ నళిని, జి.రంగేగౌడ్, విజయరంగేగౌడ్ పాల్గొన్నారు.

నాగుల ప్రతిష్ఠలో మాజీ మంత్రి

పరిగి : స్థానిక వైసీపీ నాయకుల పిలుపు మేరకు ఊటకూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన నాగుల ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ హాజరయ్యారు. మండల కేంద్రంలోని వైసీపీ నాయకుడు జయచంద్రరెడ్డి ఇటీవల చెట్టు విరిగి గాయపడటంతో పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సవిత, వైసీపీ నాయకులు నరసింహమూర్తి, దిలిప్‌కుమార్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్తలో సమస్యలు పరిష్కరించుకోండి

పావగడ, అక్టోబరు 7 : జిల్లా కేంద్రంలోని గుబ్బి వీరన్న కళామందిరంలో ఈనెల 18 నుంచి 21వతేదీ వరకు కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి బీవీరప్ప ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించుకోవచ్చని తుమకూరు జిల్లా లోకాయుక్త కమిషనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలోని తాలూకా పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు చట్టపరంగా పనులు చేయడంలో అధికారులు ఆలస్యం చేసినా, సమయానికి పనులు చేయక నిర్లక్ష్యం వహించినా అటువంటి వారిపై ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన తెలిపారు. ఈఅవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్వామా అధికారికి ఆర్థిక సాయం

పరిగి, అక్టోబరు 7: కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న డ్వామా సూపరింటెండెంట్ భరత్‌కుమార్ బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న దివ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకుడు పరిగి వేణుగోపాల్‌రావు రూ.25వేలు ఆర్థిక సాయంను అందించారు. గతంలో పరిగి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన భరత్‌కుమార్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని సోమవారం వేణుగోపాల్‌రావు స్థానిక తహసీల్దార్ హసీనాసుల్తానాకును కలిసి రూ.25వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీటీ నరసింహం, సీనియర్ అసిస్టెంట్ మురళి, ఆర్ఐ సిద్దేశ్, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.